క్లుప్తంగా

జైనబ్బీ ఉరుసు ఉత్సవాలకు పటిష్ట భద్రత



జైనబ్బీ ఉరుసు ఏర్పాట్లపై దర్గా కమిటీ సభ్యులతో చర్చిస్తున్న సీఐ మహానంది

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అర్బన్ సీఐ మహానంది తెలిపారు. ఆదివారం దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లపై సీఐ చర్చించారు. ఈసందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 23 వరకు జరిగే ఉరుసు ఉత్సవాలకు పోలీసుల సహకారం ఎంతో అవసరం అన్నారు. సీఐ మాట్లాడుతూ గంధం వేడుకల ఊరేగింపులో పోలీసులను అన్ని ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు జెండా జిలాన్, జీఎంఎస్ షాకీర్, మైనుద్దీన్, శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లి శివారులో వ్యవసాయ పొలాలు, తోటలకు విద్యుత్‌ను సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. వ్యవసాయ పొలాలు,తోటల్లో ఉన్న డ్రిప్ పైప్‌లను, స్టార్టర్లను కూడా ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధిత రైతులు ధనుంజయ, అనిత, రామాంజనేయులు తదితరులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నగేష్ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ- ఒకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన హరిజన తిప్పన్న

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని హరిజన తిప్పన్న అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు.. కల్లుదేవనహళ్లికి చెందిన తిప్పన్న పొలం పనులు చూసుకొని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో కల్లుహోళకు చెందిన హరీష్ అనే యువకుడు బైక్‌పై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో తిప్పన్నకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని బళ్లారి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులను అడగ్గా, సమాచారం లేదని చెప్పారు.

మాస్టర్‌ప్లాన్‌పై నేడు అవగాహన సదస్సు

రాయదుర్గం: పట్టణంలోని బళ్లారి రోడ్డు సీతారామకల్యాణ మంటపంలో నూతన మాస్టర్‌ప్లాన్ మ్యాప్‌పై సోమవారం సాయంత్రం 4 గంటలకు అవగాహన సదస్సు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజా అభ్యంతరాలు, చేర్పులు, మార్పులపై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరవుతారన్నారు. పట్టణ ప్రజలు, వార్డు కౌన్సిలర్లు సమావేశంలో భాగస్వాములై చర్చించాలని తెలిపారు.

దత్తతకు దాతలు కరువు

- పీ–4 పై కనిపించని స్పందన
- కుదరదంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- ఆసక్తి చూపని ధనిక, ఇతర వర్గాలు
- వారిని ఒప్పించేందుకు అధికారుల ఆపసోపాలు



ఉరవకొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో పీ-4 కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్‌డీ (ఫైల్)

రాయదుర్గం/ఉరవకొండ : 'ప్రతి ఇంటా అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి' అనే నినాదంతో పేదరికం నిర్మూలన పేరుతో కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన పబ్లిక్ (ప్రభుత్వ), ప్రైవేట్, పీపుల్ (ప్రజల) పార్టనర్‌షిప్ (పీ4) కార్యక్రమం అభాసుపాలవుతోంది. ప్రభుత్వం చెప్తున్న మాటలకు, ఆచరణకు పొంతనలేకుండా పోతోంది. ధనవంతులు, ఉద్యోగులు, సమాజంలో ఆర్థికంగా ఎదిగిన వారు, ఎన్‌ఆర్‌ఐలు కొన్ని బీపీఎల్ కుటుంబాలను దత్తత తీసుకొని ఇల్లు, ఉపాధి, పిల్లలకు విద్య, వైద్యం అవసరాలు చూసుకుంటూ, వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నాయి. సంపన్నులు, ఉద్యోగులు అందుకు విముఖత చూపుతున్నారు. ఉద్యోగులపై 'దత్తత' కత్తి పెట్టినా.. వారు ఆమాటంటేనే దౌడు అంటున్నారు.

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ 1,08,000 బంగారు కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించారు. ఈనెల 19లోపు 31 వేల కుటుంబాలను దత్తత తీసుకునేలా లక్ష్యం నిర్దేశించారు. అయితే దత్తతకు విముఖత చూపేవారి సంఖ్య కనీసం వందల్లోనూ కనిపించలేదని తెలుస్తోంది. రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్ సహా డి హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 7,074 కుటుంబాలను బంగారు కుటుంబాలను ఎంపికచేశారు. అందులో 21,583 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 5,376 కుటుంబాలను దత్తత తీసుకునేలా లక్ష్యం పెట్టుకున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 84 సచివాలయాల పరిధిలో మొత్తం పేద జనాభా 42,505 మంది ఉండగా, ఇప్పటి వరకు 15,500 మంది బీపీఎల్ కింద ఉన్నట్లు గుర్తించారు. ఈకుటుంబాల్లో ఇప్పటిదాకా బ్యాంకు ఖాతాలు లేనివారు గ్యాస్, కరెంట్ సౌకర్యాలు లేని వారు, మంచి నీరు తెచ్చుకునేందుకు అరగంట సమయం పట్టే కుటుంబాలను గుర్తించారు. వీరిని సమాజంలో ఆర్థికంగా బాగున్న వారు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఎన్‌ఆర్‌ఐలు కొన్ని బీపీఎల్ కుటుంబాలను దత్తత తీసుకోని ఆర్థిక సహాయం చేయొచ్చు. లేదా మెంటార్స్‌గా వ్యవహరించి, వారికి అవసరమైన ప్రభుత్వ పథకాలందేలా చేసి అభివృద్ధికి ఆసరాగా ఉండాలి. ఇప్పటికే బంగారు కుటుంబాల ఎంపిక సర్వే పూర్తి చేశారు. ఈనెల 19లోపు దత్తత తీసుకునే కుటుంబాలను గుర్తించనున్నారు. ఈ ప్రక్రియ కసరత్తు ముమ్మరంగా సాగుతున్నా దత్తతకు దాతలు కరువయ్యారు.

టార్గెట్ కోసం తంటాలు..

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు సంపన్నులు ముందుకు రాకపోతే సచివాలయ ఉద్యోగులు దత్తత తీసుకోవాలనే ఒత్తిడి కనిపిస్తోంది. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. నెలకు రూ.30 వేల లోపు వేతనాలందే తాము దత్తత తీసుకుని పోషించడం సాధ్యమేనా? అంటున్నట్లు తెలుస్తోంది. బంగారు కుటుంబాల కోసం తాము బంగారాన్ని అమ్ముకునే పథకంలోకి తాము రాలేమని ఇప్పటికే పలు వర్గాల వారు అధికారులకు చెప్పినట్లు సమాచారం. దీంతో టార్గెట్స్ కోసం అధికారులు తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా బంగారు కుటుంబాలకు సాయం చేయకపోయినా పర్వాలేదు.. వారికి మెంటార్స్‌గా ఉంటే చాలు అని దాతల పేర్లను నమోదు చేస్తున్నారనే మాట వినిపిస్తోంది. ఇదిలా ఉండగా యూటీఎఫ్ తోపాటు ఇతర ఉపాధ్యాయ సంఘాలు తాము ఎవరిని దత్తత తీసుకోలేమంటూ విద్యాశాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియచేయడం కొసమెరుపు. ఇదే బాటలో వ్యాపారవర్గాలు, అధికారులు ఉన్నట్లు సమాచారం.

వీరు సహాయం చేస్తే బాగుంటుందిగా...

కూటమి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు మనసున్న మారాజులుగా ఎందుకు ముందుకు రావడం లేదనే మాట జనం నుంచి వినిపిస్తోంది. కూటమి కాంట్రాక్టర్లు, మద్యం షాపు నిర్వాహకులు తలా వంద కుటుంబాలను దత్తత తీసుకుంటే బాగుంటుందని చెప్పుకుంటున్నారు. వారిని వదిలి చిరుద్యోగులను పీ–4 లో భాగస్వాములు చేయడం సబబేనా అన్న మాట గట్టిగా వినిపిస్తోంది.

కుదరదని చెప్పాం



విద్యాశాఖ అధికారులకు ఇదీవరకే పీ–4లో మేము భాగస్వాములు కాలేమని యూటీఎఫ్ తరపున వినతి పత్రం అందించారు. స్పష్టంగా తెలియచేశాం. ఉపాధ్యాయులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదు. పీ–4లో స్వచ్ఛందగా కుటుంబాలను దత్తత తీసుకునే వారు ఎవరైనా వెళ్లొచ్చు.

– సంజీవ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

చైతన్య పరుస్తున్నాం..



పీ–4 కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కుటుంబాలను దత్తత తీసుకునే స్థోమత కలిగిన దాతలను గుర్తించాం. వారు కుడా ఎంతో సానుకులంగా ఉన్నారు. పీ–4 కింద మండలానికి ఇచ్చిన టార్గెట్ ప్రకారం దాతలను గుర్తిస్తాం.

– రవిప్రసాద్, ఎంపీడీఓ, ఉరవకొండ

ఉద్యోగులపై ఒత్తిడి తేవొద్దు



పీ–4 ఉద్దేశంలో భాగంగా పేద కుటుంబాలను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తూ అభాసుపాలవుతున్నారు. దత్తత తీసుకునేందుకు సంపన్నులు ముందుకు రాకపోతే ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల మెడపై కత్తిపెట్టడం సరి కాదు. ప్రభుత్వమే పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరినీ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ అమలు చేసి, ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయాలి.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

ఓటర్ల నమోదు ప్రక్రియపై సమావేశం

రాయదుర్గంటౌన్: ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి సోమవారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి ఈఆర్‌ఓ రవిశంకర్ హాజరవుతున్నట్లు చెప్పారు.

మున్సిపల్ కార్మికుల నూతన కమిటీ ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ఆధ్వర్యంలో 13 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షురాలిగా దుర్గమ్మ, కార్యదర్శిగా మన్నూరుస్వామి, ట్రెజరర్ గా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప, రమణ, సహాయ కార్యదర్శులుగా నట్రాజ్, శివతో పాటు మరో ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాకెట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

ఉరవకొండ రూరల్/ఉరవకొండ: మండలంలోని రాకెట్ల ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. 23 ఏళ్ల తర్వాత తాము చదివిన పాఠశాలలో అందరూ కలుసుకున్నారు. ఈసందర్భంగా నాటి గురువులు షాఅలీ, షంషన్నీసా బేగం, వేణుగోపాల్, నారపరెడ్డి, మల్లికార్జున, చంద్రశేఖర్, కల్లాయప్ప, నరసింహులును ఘనంగా సన్మానించారు. పాత జ్ఞాపకాలనునెమరువేసుకొని, ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈరదలప్ప, వన్నూర్ స్వామి, సంగమేష్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, రాజు, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

20న సీతాఫల సాయం వేలం

రాయదుర్గం: మండలంలోని మెచ్చిరి గ్రామ సమీపంలోని అనుపకొండలో సీతాఫలం చెట్లకు ఈనెల 20న వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ప్రవీణ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామ రచ్చకట్ట వద్దకు వేలం పాటదారులు చేరుకోవాలన్నారు. గ్రామస్తుల సమక్షంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.500 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

పంటలకు ఊపిరి



కూడేరు: బ్రాహ్మణపల్లి వద్ద పచ్చగా కళకళలాడుతున్న ఆముదం పంట

కూడేరు: మండలంలో ఖరీఫ్‌లో సాగైన పంటలకు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ఊపిరి పోశాయి. కమ్మూరు, బ్రాహ్మణపల్లి, గొటుకూరు, రామచంద్రాపురం, ముద్దలాపురం, కడదరకుంట, పి.నారాయణపురం, కరుట్లపల్లి, చోళసముద్రం, జయపురం, కూడేరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో కంది, ఆముదం, వేరుశనగ పంటలు సుమారు 3వేల ఎకరాల్లో సాగు చేశారు. 20 రోజులపాటు వర్షం రాకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ఇలాంటి తరుణంలో పదునైన వర్షాలు కురవడంతో పంటలు పచ్చపడి కళకళలాడుతున్నాయి.

శివన్న సేవలు మరువలేనివి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి



శివన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి తదితరులు

ఉరవకొండ: కామ్రేడ్ శివన్న సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ శివన్న సంస్మరణ సభను పార్టీ తాలుకా కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శితో పాటు కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, మాజీ కమ్యూనిస్టు నేత వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్‌లు శివన్న చిత్రపటం వద్ద పూలమాల వేసి, నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శివన్న ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో కామ్రేడ్ శివన్న సోదరుడు బసవరాజు, కుమారుడు పురుషోత్తం, కూతురు నాగవేణి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ధనుంజయ, నాయకులు చంద్రాయుడు, సుల్తాన్, రసూల్, నాగేంద్ర, బండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడిని ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా ఆదివారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు



విరబూసిన బ్రహ్మ కమలాలను చూపుతున్న కళేకుర్తి దివాకర్‌రెడ్డి

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న కళేకుర్తి దివాకర్‌రెడ్డి, నిర్మల దంపతుల ఇంట ఆదివారం రాత్రి బ్రహ్మ కమలాలు విరబూశాయి. దశాబ్దకాలం క్రితం బెంగళూరులోని బంధువుల ఇంటి నుంచి బ్రహ్మ కమలం మొక్క తీసుకొచ్చి పెంచుతున్నారు. సుమారు 30 కమలాలు పూశాయి. మరో 40 వరకు మొగ్గలు ఉన్నట్లు దివాకర్‌రెడ్డి దంపతులు తెలిపారు.



కళ్యాణదుర్గం- రాయదుర్గం రింగ్ రోడ్డు వద్ద తలకిందులుగా జీబ్రా క్రాసింగ్ సిగ్నల్



ఎటు వెళ్లాలో..?

అటు చూడు.. ఇటు చూడు!



రాయదుర్గం రోడ్డులో తలకిందులుగా....

కళ్యాణదుర్గం: అనంతపురం నుంచి కళ్యాణదుర్గం, రాయదుర్గం మీదుగా మొలకాల్మూరు వరకు నేషనల్ హైవేలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా సూచికలు ప్రమాదాలకు 'సిగ్నల్స్'గా మారాయి. పలు చోట్ల ప్రమాదాల నివారణ, వేగం, మలుపులు, జీబ్రా క్రాసింగ్, లింక్ రోడ్లను సూచించే సూచిక బోర్డులు తిరగబడ్డాయి. తెలియని వాహనదారులు అటు వైపు వెళ్తే .. ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. రాత్రిళ్లు సిగ్నల్స్‌ను పాటిస్తూ వెళ్తే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్లేనని పలువురు వాహనదారులు అంటున్నారు.

మూఢనమ్మకాలు వీడాలి

అనంతపురం కల్చరల్: మూఢనమ్మకాలను వదిలి, శాస్త్రీయమైన ఆచార వ్యవహారాలు పాటించాలని వక్తలు సూచించారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం సీనియర్ కవి ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన 'ఆచారాలు–సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ జరిగింది. ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, శాంతినారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, జీఎల్ఎస్ ప్రసాద్ తదితరులు హాజరై మాట్లాడారు. సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు అనేవి వివిధ కోణాల్లో జీవితాలను ప్రభావితం చేస్తాయన్నారు. కొన్ని మాత్రమే నమ్మదగినవి, శాస్త్రీయమైనవి ఉంటాయని తెలిపారు. వేటిని అనుసరించాలో తెలియజేసే ఈ అద్భుత పుస్తకాన్ని అందరూ చదవాలన్నారు. కార్యక్రమంలో రాజారాం, యోగీశ్వర నాయుడు, సురేష్, రియాజుద్దీన్, మధురశ్రీ, ఈరన్న, బాషా, నర్సిరెడ్డి, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

'దుర్గం' పోలీసుల రూటు సప'రేటు'

- ఒక్కో కేసుకు ఒక్కో రేటు
- రాజకీయ నేతల అండతో బాధితులకు అన్యాయం
- న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్తే జేబులు గుల్ల చేస్తున్న పోలీసులు
- మట్కా, పేకాట రాయుళ్లతో నెలవారీ మామూళ్లు



సాక్షి టాస్క్‌ఫోర్స్: కళ్యాణదుర్గం పోలీసు సర్కిల్ పరిధిలో న్యాయం కోసం పోలీస్ స్టేషన్లకు వెళ్తే.. బాధితుల పక్షాన నిలవాల్సిన పోలీసు అధికారులు.. అధికారపక్షానికి వత్తాసు పలుకుతున్నారు. న్యాయం కావాలంటే ఒక్కో కేసుకు ఒక్కో రేటు నిర్ణయించి, బాధితుల నుంచి వసూలు చేస్తున్నారు. ఏ సంఘటన జరిగినా ముందుగా రాజకీయ నేతలకు సమాచారం అందించి, బాధితులపైనే తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. మట్కా, పేకాట రాయుళ్లతో నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. దీంతో సర్కిల్ పరిధిలోని పోలీసులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది.

సర్కిల్‌లోని పోలీసులపై ఆరోపణలు ఇలా..

» కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్ ఓ పోలీసు అధికారి ఏకంగా సెటిల్‌మెంట్లకు తెర లేపాడు. అధికార పార్టీ నేతల అండతో బాధితుల ఫిర్యాదులను తారుమారు చేస్తూ నేతలకు మడుగులొత్తుతూ అక్రమసంపాదనకు అలవాటుపడ్డాడు. స్టేషన్‌కు ఏ కేసు వచ్చినా స్వయంగా తానే పరిష్కరిస్తానంటూ సిబ్బందికి హుకుం జారీ చేశారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సదరు పోలీసు అధికారి స్టేషన్లో ఉంటే.. బాధితులు వెనుదిరిగిన సందర్భాలున్నాయి.

» ఇటీవల కళ్యాణదుర్గానికి చెందిన శ్రావణి అనే వివాహిత అత్తారింటి వేధింపులు తాళలేక న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తి అర్బన్ పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న పోలీసు అధికారి బాధితురాలి ఫిర్యాదును మార్చి వేశారు. దీంతో ఆమె మనస్తాపంతో పోలీసులు తనకు న్యాయం చేయరని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసును మార్చినందుకు అధికార పార్టీ నేతలు డబ్బు ముట్టజెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

» కళ్యాణదుర్గంలో మట్కా బీటర్లతో సదరు అధికారి నెలకు రూ. లక్షలకు పైగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. పట్టణంలో 18 మంది ఉండగా, ఒక్కొక్కరి వద్ద నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున రూ.1.80 లక్షలు వసూలు చేస్తున్నారు. ఇలా నెలకో మట్కా బీటరు సీఐకు డబ్బు ముట్టజెప్తున్నాడు.

» మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి స్థలం విషయంపై కర్ణాటకకు చెందిన వ్యక్తిని ఒప్పించి ఇరువురి మధ్య పంచాయితీ చేసి, ఏకంగా రూ. లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

» పట్టణంలోని ఓ సామాజిక వర్గానికి చెందిన భవన యజమానితో చేతులు కలిపి ఓ స్థలం విషయమై బాధితులకు అన్యాయం చేసేలా రూ.5 లక్షలు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు బాధితుడు ఏకంగా హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఇటీవల పోలీసు అధికారి హైకోర్టుకు వెళ్లి సమాధానం చెప్పివచ్చినట్లు సమాచారం.

» ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలించే వ్యాపారులతో చేతులు కలిపి నెలా నెలా మామూళ్లు వచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అన్యాయం చేస్తున్న పోలీసులు:

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు...రాజకీయ నేతల మెప్పు కోసం పలు కేసులలో పోలీసులు బాధితులకు అన్యాయం చేస్తున్నారు. ఇటీవల కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల్లో జరిగిన పలు ఘటనలు ఇందుకు సాక్ష్యం. కళ్యాణదుర్గంలో శ్రావణి ఘటన కంటే ముందు బ్రహ్మసముద్రం మండలంలోని బొబ్బర్లపల్లికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వెళ్లగా తప్పుడు కేసులు పెట్టేందుకు వచ్చారా అంటూ బాధితురాలిపైనే ఎస్‌ఐ నరేంద్ర కుమార్ బూతులు తిట్టారు.

సెటిల్‌మెంట్లకు అడ్డా..శెట్టూరు స్టేషన్

శెట్టూరు పోలీసు స్టేషన్ సెటిల్‌మెంట్‌లకు, పంచాయితీలకు అడ్డాగా మారింది. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై ఇరు వర్గాలను పిలిపించి ఎస్‌ఐ ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే బాధితులపైనే కౌంటర్ కేసులు పెట్టి వారిని భయ భ్రాంతులకు గురి చూసేలా ఎస్‌ఐ వ్యవహరిస్తున్నారు. మొహర్రం వేడుకల సందర్భంగా ఐదుకల్లు, కైరేవు గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడటంలో విఫలమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. శెట్టూరు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ గొడవ విషయమై ఓ యువకుడు మృతి చెందినా పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది.

నెలవారీ మామూళ్లు వసూలు..

సర్కిల్ పరిధిలోని కళ్యాణదుర్గం, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో మట్కా, పేకాట రాయుళ్లతో ఆయా పోలీసు అధికారులు, సిబ్బంది నెలవారీ మామూళ్ల వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆయా మండలాల్లో పేకాట స్థావరాలపై ముందుస్తుగానే అధికారులే లీకులిచ్చి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు ఆయా స్టేషన్లలో సిబ్బందే బాహాటంగా చెప్పుకోవడం గమనార్హం.

పట్టపగలే చోరీలు...వరుస చైన్ స్నాచింగ్‌లు

కళ్యాణదుర్గం సర్కిల్ పరిధిలో ఇటీవల దొంగతనాలు, ఆలయాల్లో చోరీలు అధికమయ్యాయి. దీనికి తోడు ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్ దొంగలు అధికమయ్యారు. వీటిని కట్టడి చేయాల్సిన పోలీసులు ఆ దిశగా అడుగులు వేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులు, సిబ్బందిపై జిల్లా ఎస్పీ జగదీష్ శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నా వారిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఇటీవల కళ్యాణదుర్గం సర్కిల్ పరిధిలోని ఓ సీఐ, ఓ ఏఎస్‌ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ల తో పాటు మరికొందరిని వీఆర్‌కు పంపినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద వాహనదారుల ఇక్కట్లు



అడిగుప్పకు వెళ్లే దారిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపునీరు

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు బీటీపీ రహదారి నుంచి అడిగుప్ప గ్రామానికి వెళ్లే అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి కింద వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దెబ్బతినడం తోపాటు వర్షపునీరు నిత్యం నిల్వ ఉంటాయి. ఆ గుంతల్లోనే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. భారీ వర్షాలు వస్తే నీటి నిల్వ పెరుగుతుందని ప్రజలు చెప్తున్నారు.